క్లుప్తంగా

కాళ్ల తహసీల్దార్‌గా సుందర్ సింగ్



కాళ్ల తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరిస్తున్న సుందర్ సింగ్

కాళ్ల: మండలం తహసీల్దారుగా జి.సుందర్‌సింగ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల్లో భాగంగా బదిలీపై కాళ్ల మండలం వచ్చిన తమసీల్దార్ శ్రీదేవి బదిలీపై కోనసీమ జిల్లాకు వెళ్లారు. ఏలూరు జిల్లాలో పని చేసిన సుందర్‌సింగ్ కాళ్ల మండల తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. వీరికి రెవెన్యూ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు.

కాళ్లకూరు వెంకన్నకు ప్రత్యేక పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కాళ్ల: కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభు శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో సప్తనదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవంలో భాగంగా గురువారం స్వామి వారికి యాగశాలార్చన, అగ్ని ప్రతిష్ఠ, కుంభావాహన, చక్రాబ్ధి మండలార్చన, పవిత్రాధివాసం, ప్రాయశ్చిత్త హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్, సిబ్బంది తగు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి



పాల్ ప్రభాకర్ (ఫైల్)

ఉండి: సీబీసీఎన్‌సీ పాఠశాల రిటైర్డ్ ఉపాధ్యాయుడు కాళింగి పాల్ ప్రభాకర్ అనారోగ్యంతో ఆయన స్వగ్రామం కలిసిపూడిలో గురువారం మరణించారు. మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఆయ న కాగితంతో బొమ్మలుచేసి వాటి ద్వారా విద్యాభ్యాసం చేయడంలో మంచి పేరు గడించారు. ఆయన మృతి పట్ల రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆకివీడు, ఉండి శాఖ అధ్యక్ష, కార్యదర్శులు జోబ్‌బాబు, గాంధీబాబురాజు, కోశాధికారి ఫణిప్రసాద్, ఉపాధ్యక్షుడు గాదిరాజు రంగరాజు, ముదునూరి గోపాలరాజు, తదితరులు సంతాపం తెలిపారు.

దాతృత్వంలో జిల్లా ముందంజ

భీమవరం(ప్రకాశం చౌక్): దాతృత్వంలో జిల్లా ముందంజలో ఉందని కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. గురువారం జిల్లాలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయాల అధికారులు, సిబ్బంది కలిపి మొత్తం రూ.1,29,250 విరాళాన్ని కలెక్టర్‌కు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.మురళీకృష్ణ ఆధ్వర్యంలో అందజేశారు. జిల్లాలోని పలు పాఠశాలలు, సంస్థల నుంచి కూడా తమ వంతు సేకరించిన విరాళాలు అందజేస్తున్నారని కలెక్టర్ తెలిపారు.

సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలి



ఉండి: ఎలుకల మందు పంపిణీ చేస్తున్న ఏవో సంధ్య



భీమవరం అర్బన్: చినఅమిరంలో ఎలుకల మందును కలుపుతున్న దృశ్యం

ఉండి: రైతులు సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపడితేనే మంచి ఫలితం వస్తుందని మండల వ్యవసాయాధికారిణి బి.సంధ్య తెలిపారు. గురువారం మండల వ్యాప్తంగా అన్ని రైతుసేవా కేంద్రాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వం ఉచితంగా అందించిన బ్రోమోడయోలిన్ (తెల్లమందు)ను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మందు తయారీ విధానాన్ని ఏవో తెలియచేస్తూ మందు తయారీలో 96 శాతం నూకలు, 2 శాతం మందు, 2 శాతం నూనె కలిపి మందును తయారు చేసుకోవాలన్నారు. ఎంపీటీసీ కునుకు రమాదేవి మాట్లాడుతూ కేవలం వ్యవసాయ భూముల్లోనే కాకుండా కాలువగట్లు, బంజరు భూములు, ఇతర నిరుపయోగ ప్రాంతాల్లోని ఎలుకల రంధ్రాలను గుర్తించి, మందు పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ గ్రామ సహాయకుడు జె.అల్ఫ్రెడ్, రైతులు పాల్గొన్నారు.

చినఅమిరంలో..

భీమవరం అర్బన్: వరిసాగులో ఎలుకలను మట్టుబెట్టకపోతే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని చినఅమిరం గ్రామంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం నూకలు, నూనె, బ్రోమోడయోలిన్ కలిపిన ఎలుకల మందు పొట్లాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎలుకలు వరి దుబ్బు మొదళ్లను కొరికి వేసి పంటను నాశనం చేస్తాయన్నారు. ఆయకట్టులో రైతులందరూ సామూహికంగా ఎలుకలను మట్టుబెట్టాలన్నారు. లేకుంటే అవి మందు పెట్టని రైతు పొలంలోకి వెళ్లి వృద్ధి చెంది మళ్లీ పంటపై దాడి చేస్తాయన్నారు. ప్రభుత్వం ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయాధిరిత గ్రామాల్లో ఎలుకలు మందును ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని కోరారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీ

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక 31 వార్డు బలసమూడి ప్రాంతంలో చేస్తున్న పారిశుద్ధ్య పనులను బుధవారం కమిషనర్ కె.రామచంద్రా రెడ్డి తనిఖీ చేశారు. సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. డ్రెయినేజీలో సిల్ట్ ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా డ్రెయినేజీ ఎక్కడైనా సరే బ్లాక్ అయిన చో వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. కమిషనర్ వెంట ఎంహెచ్‌ఓ ఇన్‌చార్జ్ సోమశేఖర్, సెంట్రల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు ఉన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల

ఆకివీడు: మండలంలో తుఫాన్, వరద ప్రభావంతో ముంపునకు గురై నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేసింది. కొల్లేరు తీరంలోని ఆకివీడు మండలంలో 1221 మంది రైతులకు చెందిన 843.27 ఎకరాల్లోని వరి పంట నష్టపోగా, రూ.210.82 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం విడుదల చేసింది. ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్ట పరిహారం అందజేస్తుంది. పంటల బీమా నూరు శాతం మంజూరు అయ్యే అవకాశం ఏర్పడింది. ఇన్‌పుట్ సబ్సిడీని ఎకరాకు రూ.20 వేలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

పట్టుదల, స్కిల్స్ ఉంటే ఉన్నత స్థానాలు తథ్యం



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో మాట్లాడుతున్న సత్యసుందరి

భీమవరం: పట్టుదల, హార్డ్‌వర్క్, స్కిల్స్ ఉంటే ఏ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లో చదివినా ఉన్నత స్థానానికి వెళ్లవచ్చని సివిల్ సాఫ్ట్‌వేర్ సంస్థలో హెచ్‌ఆర్‌గా పని చేస్తున్న ఎస్ సత్యసుందరి అన్నారు. భీమవరం ఎస్ ఆర్ కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల గూగుల్ డెవలపర్ గ్రూప్స్ బృందం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గూగుల్ డెవలపర్ గ్రూప్‌లో చేరడం ద్వారా అంతర్జాతీయస్థాయిలో సెమినార్స్, వర్క్ షాప్, హ్యాక్తాన్స్ వంటి వాటిలో భాగస్వామ్యం కావచ్చన్నారు. గ్రూపు ఏదైనా ప్రతిభ ఉంటే ఎంతటి ఉన్నత స్థానానికైనా ఎదగవచ్చని సత్యసుందరి స్పష్టం చేశారు. గూగుల్ డెవలపర్ ఫ్యాకల్టీ అడ్వైజర్ అనన్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు, టెక్నాలజీ సెంటర్ హెడ్ ఎస్.గోపాలకృష్ణమూర్తి, కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్ విభాగం ఇన్‌చార్జ్ హెడ్ ఎం.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



భీమవరంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

భీమవరం: రక్తదానం ప్రాణదానంతో సమానమని యువత రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని భీమవరం ఆదిత్య కళాశాల ప్రిన్సిపల్ వి.కమల పిలుపునిచ్చారు. గురువారం కళాశాలలో ఏఎస్ఎన్ రాజు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. 18 ఏళ్లు వచ్చిన వారంతా మూడు నెలలకోసారి రక్తదానం చేస్తే రక్త నిధులు పుష్టిగా ఉంటాయని ఫలితంగా ఆపదలో ఉన్న వారికి అవసరమైన రక్తం అందించి కాపాడవచునన్నారు. ఈ సందర్భంగా 50 మంది విద్యార్థులు రక్తదానం చేయగా వారికి సర్టిఫికెట్స్ అందజేశారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కళ్యాణ్, ట్రస్ట్ అధినేత ఏఎస్ఎన్ రాజు పీఆర్‌ఓ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిత్య సాధనతో మంచి ఫలితాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

భీమవరం: గెలుపుఓటములతో ప్రమేయం లేకుండా నిత్యం విద్య, క్రీడల్లో సాధనచేస్తే భవిష్యత్‌తో మంచిఫలితాలు సాధించవచ్చునని జీఎస్టీ కమీషనర్ ఆనంద్‌కుమార్ అన్నారు. భీమవరం భారతీయ విద్యా భవన్ స్కూల్లో గురువారం నిర్వహించిన సమావేశంలో మోటివేషన్ స్పీకర్‌గా హాజరై మాట్లాడుతూ విద్యలో గానీ, క్రీడల్లో గానీ ఒకసారి ఓటమిపాలైతే అధైర్యపడకుండా తిరిగి కృషి, పట్టుదలతో ప్రయత్నం చేయాలని సూచించారు. కార్యక్రమంలో భవన్స్ స్కూల్స్ సెక్రటరీ యూకే విశ్వనాథరాజు, ఆక్వా పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ ఉద్దరాజు శ్రీనివాస్‌రాజు, పాలకొల్లు భవన్స్ స్కూల్స్ సంచాలకుడు ఎం.సత్యనారాయణమూర్తి, ప్రిన్సిపాల్ దేవిపద్మ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేమ్స్

భీమవరం: పదవీవిరమణ చేసిన ఉద్యోగులకు అన్ని రకాల పెండింగ్ బకాయిలను ఏక మొత్తంగా ఒకేసారి చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు సంఘం అధ్యక్షుడు గాతల జేమ్స్ డిమాండ్ చేశారు. గురువారం భీమవరంలో నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త పీఆర్‌సీ కమిటీని నియమించి ఇంటీరియం రిలీఫ్ (ఆర్ఐ) ప్రకటించాలని, అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పాత రేట్లలో అమలు చేయాలని, కమ్యూటేషన్ ఆఫ్ పెన్షన్ మినహాయింపు 11 సంవత్సరాలకే పరిమితం చేయాలని, ఫ్యామిలీ పెన్షనర్స్ పుట్టిన తేది లేని వారికి నమోదు చేయాలన్నారు. స్టేట్ బ్యాంకు డిప్యూటీ మేనేజర్ బాబ్జి మాట్లాడుతూ పెన్షనర్స్‌కు అన్ని రకాల సేవలను ఎస్‌బీఐలో సేవా భావంతో చేస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాగిరాజు నారాయణ రాజు, కోశాధికారి బీవీ రవిప్రసాద్ ప్రవేశపెట్టిన నివేదికలను కార్యవర్గం ఆమోదించింది. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సాగిరాజు నారాయణరాజు, సహాధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్‌రాజు, ఎస్ఎస్ఎస్ పాల్, సూర్యనారాయణ, కె.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

పాలకోడేరు: అమ్మాయిలు ఒంటరిగా బయట తిరగొద్దని, అవసరమైనప్పుడు గుంపులు గుంపులుగా వెళ్లాలని మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ కె.లలిత ఉద్బోధించారు. గురువారం విస్సాకోడేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆమె విద్యార్థినులతో ముచ్చటిస్తూ గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. మహిళా చట్టాలు, బాల్య వివాహ నిరోధక చట్టం, పోక్సో చట్టం, లైంగిక వేధింపులు, స్త్రీల హెల్ప్‌లైన్ గురించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్లు మొదలగు వాటిని వివరించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ కుమారి, హెల్త్ విజిటర్ నాగమణి, ఏఎన్ఎంలు హేమకుమారి, భవాని ఆశ వర్కర్లు, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా చిలకమర్తి జయంతి



చిలకమర్తి జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: స్థానిక ఎంఆర్‌కే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రముఖ జాతీయ కవి చిలకమర్తి లక్ష్మీనరసింహం జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం శనివారపు వరప్రసాద్ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వీరవాసరం కళాపరిషత్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ నూకల కనకదుర్గ లక్ష్మీనరిసింహం సేవలను కొనియాడారు. అనంతరం ప్రముఖ కవి, రచయిత లింగం సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. ముందుగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలను నిర్వహించిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పంపన సాయిబాబు, చిలుకూరి ఫణికుమార్, వై.వెంకటేశ్వరరావు, కుసుమే ఆనందరావు, బి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

పాలకోడేరు: విద్యుత్ వినియోగదారులు తమ సమస్యల పరిష్కారానికి శుక్రవారం భీమవరం ఇండస్ట్రియల్ ఏరియాలో గల విద్యుత్ కార్యాలయం వద్ద విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని, డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహిస్తామన్నారు. ఈ పరిష్కార వేదిక లో విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సేవా భావంలో ఆకివీడు భేష్



ముంపు బాధితులకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేస్తున్న లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు

ఆకివీడు: ప్రతీ ఒక్కరిలో సేవా భావం నింపుకొని దాతృత్వంతో పేద ప్రజలకు అండగా ఆకివీడు లయన్స్ నిలబడుతుందని లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు అన్నారు. సమతా నగర్‌లోని ముంపు బాధితులకు బుధవారం దుప్పట్లు, దస్తులు, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ వ్యక్తీ సేవాభావంతో ఉన్నప్పుడే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆకివీడులోని లయన్స్ క్లబ్‌కు 50 ఏళ్లు నిండాయన్నారు. 10 మంది సభ్యులతో ఏర్పడి 250 మందికి పైగా సభ్యులతో నాలుగు క్లబ్‌లుగా ఏర్పడి సేవా కార్యాక్రమాల్ని విస్తృత పరిచారన్నారు. అనంతరం చెరుకుమిల్లి గ్రామంలోని జెడ్పీ స్కూల్‌లో మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో లయన్స్ ప్రతినిధులు చిలువూరి కృష్ణంరాజు, ఆర్వీ సూర్యనారాయణరాజు, దాట్ల రామరాజు, జీవీ సత్యనారాయణరాజు, కాకర్ల రాజరాజేశ్వరి, మోరా జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛతా హీ సేవ

భీమవరం(ప్రకాశం చౌక్): స్వర్ణాంధ్ర-2047 స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారి కార్యాలయంతో పాటు జిల్లాలో అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ల సిబ్బంది శుభ్రపరిచారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. డి. మహేశ్వరరావు మాట్లాడతూ ప్రతి ఒక్కరూ సంవత్సరానికి 100 గంటలు వారానికి 2 గంటలు స్వచ్ఛందంగా పరిశుభ్రత కోసం పనిచేయాలని సూచించారు.

బదిలీలతో మండలంలో ఖాళీలు

ఆకివీడు: మండలంలోని పలు పోస్టులు ఇన్‌చార్జిలతో కొనసాగుతోన్నాయి. మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి కె.వాణీకి లింగపాలెం బదిలీ అవ్వడంతో ఆమె వెనువెంటనే ఆర్డర్ తీసుకొని వెళ్లిపోయారు. పంచాతీరాజ్ ఏఈ రమణమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పార్వతిలకు బదిలీ ఆర్డర్లు అందడంతో ఆయా ప్రాంతాలకు వెళ్లి జాయిన్ అయ్యారు. మండలానికి బదిలీ అయిన ఆయా శాఖల ఉద్యోగులు మాత్రం నేటికీ జాయిన్ అవ్వలేదు. రెండో తేదీ వరకూ రిలీవ్ చేయొద్దని పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్ నుంచి ఆర్డరు వచ్చినప్పటికీ యుద్ద ప్రాతిపదికన వారు ఆయా ప్రాంతాల్లో జాయిన్ అయ్యారు.

ఇంటి నిర్మాణ లబ్ధిదారులను ప్రోత్సహించాలి



ఇంజనీరింగ్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ ఏఈ వెంకట్రావు

తాడేపల్లిగూడెం రూరల్: ఇంటి నిర్మాణ లబ్ధిదారులను ప్రోత్సహించి వేగిరపర్చాలని హౌసింగ్ ఏఈ వైవీ. వెంకట్రావు అన్నారు. గురువారం మండలంలోని 23 గ్రామ సచివాలయాల వద్ద ఇంజనీరింగ్ సిబ్బందితో 'మన ఇల్లు - మన గౌరవం' సమావేశం నిర్వహించారు. మన ఇల్లు - మన గౌరవం కార్యక్రమానికి సంబంధించి ఆయా గ్రామాలకు ఇన్‌ఛార్జీలను నియమించారు. దీనిలో భాగంగా అప్పారావుపేట, మోదుగ గుంట గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో హౌసింగ్ ఏఈ వెంకట్రావు మాట్లాడుతూ మండలంలో 647మంది గృహ నిర్మాణ లబ్ధిదారులు ఉన్నారని, ఇంటి నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఈక్రమంలో లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 28వ తేదిన లే అవుట్ వద్ద సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ప్రతీ లబ్ధిదారుడు ఇంటి నిర్మాణాలను చేపట్టే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, ఉద్యాన వన శాఖాధికారి శ్రీలక్ష్మి, ఏపీఎం జీవీకేడీఎం .లక్ష్మి, మండల వ్యవసాయాధికారి ఆర్ ఎస్.ప్రసాద్, ఎస్. శివశంకర్, పి. రవిబాబు, కే.శ్రీదేవి, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలను రోడ్డున పడేయడం దారుణం



బాధితులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్

ఆకివీడు: తరతరాలుగా నిరుపేదలు గత్యంతరం లేక రోడ్డు, కాలువ పోరంబోకు స్థలాల్లో బ్రతుకు జీవనం గడుపుతుంటే అర్ధాంతరంగా వాళ్లను ఖాళీ చేయమనడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణదారుల సమస్యలను తెలుసుకునేందుకు గురువారం ఆ ప్రాంతానికి వెళ్లిన సీపీఎం బృందానికి బాధితుల గోడు వినిపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, డోకల లక్ష్మి, సందక ఉదయ్ కుమారి, బీవీ.వర్మ, డోకల రవితేజ, బి.రాంబాబు, దొడ్డి పద్మ, యర్రా కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

భీమవరం అర్బన్: భీమవరంలోని ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో విద్యుత్ సరఫరాలో తరచుగా వచ్చే అంతరాయాలతో పాటు విద్యుత్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు ఇవ్వవచ్చని పేర్కొన్నారు.

పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపాలి

ఇరగవరం: గ్రామాల్లో పారిశుద్ధ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పశ్చిమ గోదావరి జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి మహేశ్వరరావు అన్నారు. గురువారం ఇరగవరం పీహెచ్‌సీలో ఆకస్మిక తనీఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్, రోగులు వార్డుల్లో శానిటేషన్ సరిగా లేదన్నారు. సిబ్బంది పనితీరుపై అగ్రహం వ్యక్తం చేశారు.

హాస్టల్ విద్యార్థినులకు దుప్పట్ల పంపిణీ



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల హాస్టల్ విద్యార్థినులకు వాసవిక్లబ్ ఆధ్వర్యంలో గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పీఎన్‌వీవీ సత్యనారాయణగుప్త, ఆర్‌వీ శ్రీనివాస్ మాట్లాడుతూ చదువులో రాణిస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని విద్యార్థి దశలోనే సేవాభావం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వెనుకబడినతరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి జీవీఆర్‌కేఎస్ఎస్ గణపతిరావు, హాస్టల్ వార్డెన్ ఆర్‌జీటీ జయంతి, వాసవిక్లబ్ మాజీ అధ్యక్షుడు నందిపాటి రామకృష్ణ, పి.ఆనంద్ కుమార్, వి.శ్రీనివాసగుప్త తదితరులు పాల్గొన్నారు.

మంచి ఆహారపు అలవాట్లతో గుండె జబ్బులు దూరం

తణుకు టౌన్: మంచి ఆహార ఆలవాట్లతో పాటు శరీరానికి తగినంత వ్యాయామం ఉంటే గుండె జబ్బులు దరి చేరవని ప్రముఖ గుండె సంబంధిత వైద్యులు డాక్టర్ యూ వెంకటేష్ తెలిపారు. గురువారం రాత్రి రోటరీ క్లబ్‌లో జరిగిన గుండె వ్యాధులు, నివారణ, జాగ్రత్తలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆనందం మస్తాన్‌రావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి కఠారి సిద్ధార్ధ, జీ సుధాకర్, అక్కిన కాశీ విశ్వనాథం, నూలి సత్యనారాయణ, జేఎస్ సుబ్రహ్మణ్యం, నందిగం సుధాకర్, గమిని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ఇరగవరం: రేలంగి టిఎం జెడ్పీహెచ్ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో నియోజకవర్గస్థాయిలో సత్తాచాటి జిల్లా స్థాయి క్రీడలకు సుమారు 19 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు.